న్యూస్‌రీల్

24న చెన్నైలో కార్గో వస్తువుల వేలం

తిరుపతి అర్బన్ : చెన్నైలోని మాధవరం బస్టాండ్‌లో ఉన్న తిరుపతి కార్గో పాయింట్ వద్ద డెలివరీ కాకుండా మిగిలిపోయిన వస్తువులను ఈ నెల 24వ తేదీన వేలం వేయనున్నట్లు ఆర్టీసీ కార్గో ఇన్‌చార్జి నిర్మల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని, పాట దక్కించుకున్నవారు వెంటనే మొత్తం సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. అలాగే వస్తువులను సైతం తక్షణమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని వివరించారు.

పారా మెడికల్ కోర్సులకు ఫైనల్ కౌన్సెలింగ్ రేపు

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలో అలైడ్ హెల్త్ సైన్స్ ప్రొఫెషనల్ కౌన్సిల్ డిప్లొమా, పారామెడికల్ కోర్సుల్లో మిగులు సీట్లకు మంగళవారం తుది కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ డిప్లొమా, పారామెడికల్ కోర్సులలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఇతర వివరాలకు 9440879943 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అంధకారంపై విజయమే దీపావళి


వెంకటేశ్వర్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : అంధకారంపై వెలుగు సాధించిన విజయమే దీపావళి పండుగని కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సంఘాల్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ జిల్లావాసులందరూ సంతోషంగా దీపావళిని జరుపుకోవాలని కోరారు.

ఏపీ లాసెట్, పీజీఎల్‌సెట్ అడ్మిషన్లు ప్రారంభం

తిరుపతి రూరల్ : ఏపీ లాసెట్- పీజీఎల్‌సెట్-2025 అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్ ఆప్షన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు నిర్ణయించిన తేదీల ప్రకారం ప్రక్రియను పూర్తిచేసి క్లాసులకు హాజరు కావలసిందిగా కన్వీనర్ సీతా కుమారి తెలిపారు. అభ్యర్థులు ఈనెల 21, 22 తేదీల్లో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. 23న వెబ్ ఆప్షన్లు మార్పు, 25న సీటు అలాట్‌మెంట్, 27 నుంచి 29 వరకు ఆయా కాలేజీల్లో ప్రవేశం ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు httpr://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రేపు తుమ్మలగుంటలో నరకాసుర వధ


సిద్ధమవుతున్న నరకాసుర ప్రతిమ

తిరుపతి రూరల్ : దీపావళి వేడుకల్లో భాగంగా ఆనవాయితీ ప్రకారం సోమవారం తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద నరకాసుర వధ నిర్వహించనున్నారు. ఇందుకోసం రూ.2లక్షల వ్యయంతో 20 అడుగుల నరకాసుర ప్రతిమను ప్రత్యేకంగా తయారు చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 5.30 గంటలకు నరకాసుర వధ కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు.

నగుబాట!


వెంకటగిరి మండలం పాపమాంబపురం వద్ద రోడ్డు దుస్థితి

అధ్వాన్నంగా గ్రామీణ రహదారులు

- అడుగు పెట్టలేని దుస్థితిలో పల్లెసీమలు
- పూర్తి స్థాయిలో ఛిద్రమైన రోడ్లు
- ఎటుచూసినా బురద.. గుంతలు
- సంక్రాంతి సంగతి దేముడెరుగు.. దీపావళి వచ్చినా పట్టించుకోని పాలకులు

తిరుపతి..చిత్తూరు జిల్లాల్లో గ్రామీణ రహదారులు గుంతలమయంగా మారిపోయాయి. వర్షాకాలం నేపథ్యంలో పూర్తిగా ఛిద్రమయ్యాయి. సంక్రాంతి నాటికే రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన చంద్రబాబు మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. అడుగుకో మడుగును తలపిస్తున్న మార్గాల్లో పల్లెవాసుల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఈ క్రమంలోనే ఇసుక.. గ్రావెల్ మాఫియా కారణంగా రహదారులు మరింతగా దెబ్బతిన్నాయి. అతి వేగంతో వెళుతున్న భారీ వాహనాల తాకిడికి సీసీ రోడ్లు సైతం శిథిలావస్థకు చేరాయి. అక్కడక్కడా నాణ్యతాప్రమాణాలను గాలికి వదిలి అరకొరగా మరమ్మతులు చేసిన మార్గాలు కూడా మళ్లీ ధ్వంసమయ్యాయి. ఈ మేరకు కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పల్లెదారులను అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఊదరగొట్టి.. అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేయడంపై మండిపడుతున్నారు. ఈ ఏడాది పెద్ద పండుగ జరుపుకునేందుకు స్వగ్రామాలకు చేరుకునే వారికి చూడముచ్చటైన మార్గాలు స్వాగతం పలుకుతాయని ప్రకటనలు గుప్పించి.. దీపావళి వచ్చినా గతుకుల.. అతుకుల రోడ్లతోనే సరిపెట్టి అవస్థలు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ప్రతినిధి, తిరుపతి


నాయుడుపేట: బురదమయంగా జువ్వలపాలెం దారి


నిలువెత్తు గోతులతో మర్రిమంద-పాపానాయుడుపేట రహదారి


గుంతల దారిలో ఇక్కట్లు


ఏర్పేడు : బురదమయంగా పాపానాయుడుపేట-చెన్నంపల్లె రహదారి


పెళ్లకూరు : బురద తొలగించుకుంటూ వెళ్లాల్సిందే..!


శెట్టిపల్లె రోడ్డులో కుదుపులు తప్పవు మరి..!

ప్రాణం తీసిన గుంత


శ్రీకాళహస్తి- తడ మార్గంలో ఇనమాలగుంట వద్ద యువకుడి మృతికి కారణమైన గుంత(ఇన్‌సెట్) ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశులు

వరదయ్యపాళెం: మండలంలోని శ్రీకాళహస్తి–తడ మార్గంలో ఆర్ అండ్ బీ రహదారిపై పడిన గుంత నిండు ప్రాణాన్ని బలిగొంది. సత్యవేడు మండలం, జడేరి పంచాయతీ, కేవీకండ్రిగకు చెందిన ఎం.వెంకటేశులు (35) శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తూ తడలో నివాసముంటున్నారు. ఈ నెల 6న రాత్రి 10 గంటల సమయంలో వరదయ్యపాళెంలో తన స్నేహితుడిని కలుసుకుని తిరిగి తడలోని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలోని బత్తలవల్లం సమీపంలో ఇనమాలగుంట వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుపై ఉన్న గుంతలో దిగి అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. దీంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్ల దుస్థితి కారణంగా నిండు ప్రాణం గాల్లో కలిసింది. ఈ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


రేణిగుంట మండలం గుత్తివారిపల్లెలో..


ఆనవాలు లేని ఆర్‌సీపురం మండలం సూరావారిపల్లె ప్రధాన రహదారి


వాకాడు : ప్రమాదకరంగా తిరుమూరు రోడ్డు


గుత్తివారిపల్లె దారి మధ్యలో మడుగు


బాలాయపల్లెలో వాహనదారుల బాధలు


నాగలాపురం- టీపీకోట మార్గంలో కడివేడు వద్ద గుంతలమయంగా రహదారి


కాలువ కాదు సుమా.. రోడ్డే ఇది..!

అయోమయం.. ఎస్వీయూ భవితవ్యం!

రాయలసీమకే తలమానికమైన ఎస్వీయూనివర్సిటీ భవిష్యత్ అయోమయంలో పడింది. అడ్మిషన్ల శాతం తగ్గిపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ప్రవేశానికి విద్యార్థులు వెనకడుగు వేసేందుకు కూటమి ప్రభుత్వ వైఖరే ప్రధాన కారణమని మేధావులు ఆరోపిస్తున్నారు. వర్సిటీని రాజకీయాలకు వేదికగా మార్చడంతోనే ఈ దుస్థితి దాపురించిందని విమర్శిస్తున్నారు. అవసరాలకు తగ్గట్టు అధ్యాపకులు లేకపోవడంతో సమస్య మరింత తీవ్రమైందని స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఉన్నత విద్యామండలి సైతం స్పాట్ అడ్మిషన్లపై శీతకన్ను వేయడంతో ప్రవేశాలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఎస్వీయూ పరిపాలనా భవనం

- అంతంతమాత్రంగా అడ్మిషన్లు
- పలు కోర్సుల్లో 15 శాతానికి మించని ప్రవేశాలు
- ఆందోళనలో అధ్యాకులు, మేధావులు

తిరుపతి సిటీ : శ్రీవేంకటేశ్వర విశ్వవిదాలయ మనుగడపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది నుంచి వర్సిటీలో పలు పీజీ కోర్సులలో ప్రవేశాలు దారుణంగా పడిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఎస్వీయూలోని సుమారు 58 విభాగాలకు పీజీసెట్-2025 సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా కేవలం 12 విభాగాల్లో 40శాతం సీట్లు భర్తీ కాగా మిగిలిన డిపార్ట్‌మెంట్లలో కేవల 25 శాతం సీట్లు భర్తీ కాకపోవడం గమనార్హం. ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఉన్నత విద్యామండలి మూడో విడత ప్రక్రియకు అవకాశం ఇస్తుందా... లేక స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తుందా వేచిచూడాలి.

పలు కోర్సుల్లో కేవలం 15శాతమే..

కూటమి ప్రభుత్వంలో పలు ఆర్ట్స్ గ్రూప్‌లలోని పీజీ కోర్సులను మెర్జింగ్ పేరుతో ఎత్తివేశారు. దీంతో చాలామంది విద్యార్థులు ఎస్వీయూలో చేరేందుకు మొగ్గు చూపడంలేదు. అందుకే ఆర్ట్స్ విభాగాలలోని పలు కోర్సులలో ి కనీసం 15శాతం సీట్లు భర్తీ కాలేదని ఆయా హెచ్‌ఓడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సైన్స్, కంప్యూటర్ విభాగాలలో 45శాతం ప్రవేశాలు జరిగాయని, ప్రస్తుతం అందులో సగం కూడా భర్తీ కాలేదని ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వర్సిటీ ఉనికే ప్రమాదకరంగా మారుతుందని వాపోతున్నారు.

అధ్యాపకుల కొరత

శాశ్వత అధ్యాపకుల కొరత వర్సిటీని తీవ్రంగా వేధిస్తోంది. సుమారు 400 మందికి పైగా శాశ్వత అధ్యాపకులు అవసరం ఉండగా కేవలం 130మంది మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. తాత్కాలిక అధ్యాపకులను సైతం ఇటీవల తొలగించడంతో నాణ్యమైన విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారు. భాషా ప్రాతిపదిక కోర్సులైన సంస్కృతం, తెలుగుపై ఈ ప్రభావం తీవ్రంగా పడింది. దీంతో పాటు హిస్టరీ, పొలిటికల్ సైనం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంత్రోపాలజీ, సోషియాలజీ, సైకాలజీ, హోంసైన్స్ వంటి కోర్సులలో ఈ ఏడాది కనీసం 15శాతం సైతం అడ్మిషన్లు కూడా లేకపోవడం దారుణం.

ప్రధాన కారణం ఇదేనా?

ఉన్నత విద్యామండలి ఆలస్యంగా అడ్మిషన్లు చేపట్టడం, కౌన్సెలింగ్ ప్రక్రియను సమయానికి మొదలుపెట్టకపోవడం కూడా ప్రభావం చూపిందని నిపుణులు, ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వర్సిటీని రాజకీయ వేదికగా మార్చడం కూడా ప్రధాన కారణమని బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

కార్తీక శోభ



శ్రీకాళహస్తీశ్వరాలయం విశేషాలంకరణలో దేదీప్యంగా ప్రకాశిస్తోంది. కార్తీక మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యుద్దీప కాంతులీనుతోంది. పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేకం ఏర్పాట్లు చేశారు. సామాన్యులు సైతం ఆది దంపతులను సులభతరంగా దర్శించుకునేలా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ముక్కంటి సేవలో ప్రతి ఒక్కరూ తరించే అవకాశం కల్పించారు. – శ్రీకాళహస్తి



క్లుప్తంగా

గ్రామదేవత విగ్రహ ధ్వంసం



ధ్వంసమైన వేమలమ్మ విగ్రహం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కుక్కంబాకం పంచాయతీ తానిగిల్లు గ్రామ దేవత వేమలమ్మ విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఆదివారం ఈ మేరకు పోలీసుస్టేషన్‌లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గేట్ల తాళాలు పగులగొట్టి ఆలయంలోకి చొరబడి అమ్మవారి ప్రతిమను ధ్వంసం చేశారని పేర్కొన్నారు.

పరిపూర్ణం.. పవిత్రోత్సవం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో దేవదేవేరులను ఊరేగించారు. ఈ క్రమంలోనే యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. కుంభప్రోక్షణ, ఆచార్య బహుమానం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్ బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 82,136 మంది స్వామివారిని దర్శించుకోగా 29,023 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక ఈబీసీ కాలనీలో ఆదివారం వీధి కుక్కలు దాడి చేయడంతో ఐదేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. కాలు విరిగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఈ క్రమంలో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్ : తిరుపతి–రేణిగుంట మార్గంలోని రిలయన్స్ అండర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించామని వెల్లడించారు. మృతుడు వివరాలు తెలిసిన వారు 9440627638 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



కూటమి చెరలో చెరువులు!

ప్రకృతి సంపదను అక్రమార్జనకు ప్రధాన వనరుగా కూటమి నేతలు మార్చుకున్నారు. కాసుల కోసం దేనికైనా తెగబడుతున్నారు. ఇసుక.. మట్టితోపాటు చెరువుల్లోని చేపలను సైతం యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. మత్స్యకారుల జీవనోపాధిని కబళిస్తున్నారు. అందులో భాగంగా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని నందిగుంట, దామినేడు తటాకాలను అడ్డాగా చేసుకుని దందా సాగిస్తున్నారు. ఆ చెరువుల వేలం అడ్డుకుంటూ నిత్యం మత్స్యసంపదను దోచుకుంటున్నారు. ఈ మేరకు కూటమి ప్రజాప్రతినిధి ఒత్తిడికి తలొగ్గిన అధికారులు సైతం పూర్తి సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతుంటే చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా చేపల వేట

- ఇప్పటి వరకు సుమారు రూ.45లక్షల వరకు స్వాహా
- ఏడాదిన్నరగా నందిగుంట, దామినేడు చెరువుల్లో దోపిడీ
- వేలం నిర్వహించకుండా ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి
- పూర్తిగా సహకరిస్తున్న అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలోని అత్యంత ఆదాయం వచ్చే పంచాయతీలలో తిరుచానూరు ముందంజలో ఉంటుంది. అయితే అధికారుల అలసత్వం కారణంగా మరింత రాబడికి గండిపడుతోంది. ఈ పంచాయతీ పరిధిలోని నందిగుంట, దామినేడు చెరువుల వేలం ద్వారా గతంలో అదనపు ఆదాయం చేకూరేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చెరువులను వేలం పాట నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ప్రజా ప్రతినిధి ఆదేశాలతోనే..

''రాష్ట్రంలో మా పార్టీ అధికారంలోకి వచ్చింది..మా వాళ్ళు కుడా నాలుగు రాళ్ల వెనకేసుకోవాలి కదా.. ప్రభుత్వానికి అంత నష్టం రాదులే.. మీకు ఇబ్బంది రాకుండా నేను చూసుకుంటాను.. మీరు ఎట్టి పరిస్థితిలో చెరువులకు వేలం పాట నిర్వహించేందుకు వీల్లేదు'' అంటూ చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజా ప్రతినిధి అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. మరో ఏడాది పాటు చెరువులు వేలం చేపట్టకూడదని, తిరుచానూరులోని టీడీపీ నేతలను ఎవరు ఇబ్బంది పెట్టినా సహించే ప్రసక్తే లేదని హెచ్చరించినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.

పచ్చమూక పాగా!

నందిగుంట, దామినేడు చెరువుల్లో ఏడాది పొడవునా నీరు పుష్కలంగా ఉంటుంది. దీంతో మత్స్య సంపద సమృద్ధిగా పెరుగుతుంది. ఇది గమనించిన స్థానిక టీడీపీ నేతలు అనధికారికంగా చెరువులను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అనధికారికంగా ఓ వ్యవస్థను నియమించుకుని ప్రతిరోజూ చేపల పట్టుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. నిత్యం వేకువజాము నుంచే దందాను ప్రారంభిస్తున్నారు. వందల కిలోల చేపలను తిరుపతి, రాయలచెరువు, చంద్రగిరి ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. స్థానిక మత్స్యకారులు చేపలు పట్టేందుకు వెళితే దౌర్జన్యాలకు దిగుతున్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏడాదికి రూ.30 లక్షలకు పైగా నష్టం

నందిగుంట, దామినేడు చెరువులను కబళించిన కూటమి నేతలు భారీ మొత్తంలో ఆర్జించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో వేలంపాట ద్వారా చెరువులో చేపలను పట్టుకుని విక్రయించుకున హక్కును పొందేవారు. అయితే ప్రస్తుతం అనధికారికంగా సాగుతున్న ఈ దందా ద్వారా ఏడాదికి రూ.30 లక్షలకు పైగా కూటమి నేతల జేబుల్లోకి వెళుతోందని స్థానికులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అంటే గత ఏడాదిన్నరలో సుమారు రూ.45లక్షలను కూటమి నేతలు దోచుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నప్పటికీ జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అభ్యర్థనలకు తిరస్కారం

నందిగుంట, దామినేడు చెరువులను వేలం పాట లేదా లీజు పద్ధతిలో తమకు ఇవ్వాలంటూ పలువురు స్థానికులు ఇటీవల అధికారులను కోరారు. ఈ మేరకు అర్జీలను సైతం అందజేశారు. అయితే సదరు చెరువులకు వేలంపాట నిర్వహించే అవకాశం లేదని, స్థానికుల అభ్యర్థులను అధికారులు తిరస్కరించినట్లు తెలిసింది.

> **ప్రతిపాదనలు పంపించాం**
>
> తిరుచానూరు పంచాయతీలోని దామినేడు, నందిగుంట చెరువుల వేలంపాట కోసం ఇప్పటికే ప్రొసీడింగ్ శాఖకు ప్రతిపాదనలు పంపాం. పంచాయితీ ఆదాయానికి గండి కొడితే సహించే ప్రసక్తే లేదు. మరో వారంలో చెరువుల వేలం పాట నిర్వహించేందుకు చర్యలు చేపడతాం.
>
> – మణి, పంచాయతీ సెక్రటరీ, తిరుచానూరు

పోలీసుల తీరుపై పాత్రికేయుల నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విలేకర్లు

చిల్లకూరు : మీడియా ప్రతినిధులపై వరుసగా దాడులు జరుగుతున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంపై ఆదివారం గూడూరు టవర్ క్లాక్ వద్ద పలువురు పాత్రికేయులు నిరసన తెలిపారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు అధికమవుతున్నాయని, వాటిని ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై యథేచ్ఛగా దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. అందులో భాగంగా ఈ నెల 15వ తేదీన ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పూటుగా మద్యం తాగి బైక్‌పై వెళుతూ కిందపడిపోయారని, వారిని పైకి లేపినందుకు విలేకర్లపైన దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటివి పోలీసుల దృష్టికి తీసుకెళితే హేళనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ తిరుపతయ్య వెంటనే అక్కడకు చేరుకుని విలేకర్లకు నచ్చజెప్పారు. డీఎస్పీతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో జర్నలిస్టులు ఆందోళన విరమించారు.



కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట : కోటి సంతకాల సేకరణతో ప్రజా ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టిందని, దీంతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాల్సిందేనని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ స్పష్టం చేశారు. ఆదివారం కోట మండలంలోని అల్లంపాడు, వంజివాక, పుచ్చలపల్లెలో పార్టీ సీఈసీ సభ్యుడు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన మోసపూరితంగా సాగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు పంగనామాలు పెట్టారని ఆరోపించారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కేంద్రంతో పోరాడి 17 మెడికల్ కళాశాలలను తీసుకువస్తే, వాటిని కుట్రపూరితంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు చంద్రబాబు పన్నాగం పన్నుతున్నారని విమర్శించారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకు తెగబడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చారని కొనియాడారు. సీఈసీ సభ్యుడు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ యూరియా కోసం రైతులు క్యూలో బారులు తీరిన ఘటనలు గతంలో ఎప్పుడూ లేవన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్నదాతలు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. అనంతరం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, కోట, చిల్లకూరు మహిళా కన్వీనర్లు రేష్మ, లలిత, నేతలు రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పాదర్తి రాధాకృష్ణారెడ్డి, సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాంబాబు, సాయిరెడ్డి, ప్రసాద్‌గౌడ్, సురేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో నేతలు

ముక్కంటి సేవలో కల్వకుంట్ల కవిత



ధ్వజస్తంభం వద్ద కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని ఆదివారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కుటుంబ సమేతంగా సేవించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆమె ప్రత్యేకంగా రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి ఆదిదంపతుల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, నేతలు పగడాల రాజు, వయ్యాల కృష్ణారెడ్డి, కంఠా ఉదయ్‌కుమార్, గున్నేరి కిషోర్‌రెడ్డి, మున్నా రాయల్, మునికృష్ణారెడ్డి, కూనాటి రమణయ్యయాదవ్, పఠాన్ ఫరీద్, పసల కృష్ణయ్య, ముని, శివకుమార్‌యాదవ్, పులి రామచంద్ర, శ్రీను, సాగిరాబీ, షర్మిల ఠాగూర్, పెరుమాళ్ చౌదరి, ఫజల్ పాల్గొన్నారు.

చిన్నారి అప్పగింత



తల్లిదండ్రులతో పసిపాప

తిరుపతి క్రైమ్ : తల్లిదండ్రుల నుంచి దూరమైన చిన్నారిని మహిళా పోలీసులు తిరిగి అప్పగించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. శనివారం రాత్రి 7 గంటల సమయంలో గోవిందరాజస్వామి ఆలయం వద్ద సుమారు 6 నెలల పాప ఏడుస్తూ కనిపించింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో రాత్రి అంతా ఓ మహిళ తన ఇంటికి తీసుకెళ్లి పాపను జాగ్రత్తగా చూసుకుంది. ఆదివారం ఉదయం మహిళా పోలీసుల వద్దకు చేర్చింది. ఈ క్రమంలో చిన్నారి అదృశ్యంపై ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందిందని తెలియడంతో వెంటనే అక్కడకు వెళ్లి తల్లిదండ్రుల వివరాలను సేకరించి పాపను అప్పగించారు. పోలీసులకు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైం: సెల్‌ఫోన్ దొంగలను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు కథనం.. సెల్‌ఫోన్ దొంగల సమాచారం మేరకు ఈస్ట్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామాంజినేయులు, సిబ్బంది తిరుపతిలోని విష్ణునివాసం, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర పరిసరాల్లో నిఘా పెంచారు. అక్కడ తచ్చాడుతున్న అనంతపురం జిల్లాకు చెందిన పవన్‌కుమార్‌నాయక్, హైదరాబాద్‌కు చెందిన మందాల దినేష్, ప్రకాశం జిల్లాకు చెందిన మోగానందరెడ్డి, మదనపల్లికి చెందిన అశోక్, కడపకు చెందిన శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో భక్తులు, యాత్రీకులు, ప్రయాణికుల వద్ద సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నట్టు ఒప్పుకున్నారు. ఈ మధ్య కాలంలో విష్ణునివాసం వద్ద బెంగళూరుకు చెందిన యాత్రికుల రెండు సెల్‌ఫోన్లు, 30 గ్రాముల బంగారాన్ని చోరీ చేసినట్టు అంగీకరించారు. అలాగే టీటీడీ శ్రీనివాసం వద్ద యాత్రికుల రూమ్‌లో మూడు సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు దొంగతనం చేసి పట్టుబడ్డారు. ఈ మేరకు వారి నుంచి 18 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఆపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు.

కమీషన్ల వైద్యం

- చిన్నారులను అనారోగ్యం బారిన పడేస్తున్న వైనం
- తమిళనాడు, కర్ణాటక నుంచి చిత్తూరు జిల్లాకు మందుల సరఫరా
- కమీషన్ అధికంగా వచ్చే మందులనే రెఫర్ చేస్తున్న వైద్యులు
- పలు ప్రైవేటు ఆస్పత్రుల కక్కుర్తి
- పట్టించుకోని అధికారులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): మధ్యప్రదేశ్‌లో కోల్డ్రిఫ్ అనే దగ్గు సిరప్ పసి ప్రాణాలను బలిగొంది. అలాగే రాజస్థాన్‌లోని మరణాలు సంభవించాయి. సిరప్ తీసుకున్న పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. జ్వరం, పొట్ట ఉబ్బిపోయి...మూత్రపిండాలు దెబ్బతినడంతో మరణాలు సంభవించాయి. ఈ విషయం దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించడంతో ఆందోళనకు దారి తీసింది. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు వైద్యంలో భద్రతను ప్రశ్నిస్తోంది.

కాసుల కక్కుర్తి

జిల్లాలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. ఇష్టారాజ్యంగా తమిళనాడు, కర్ణాటక నుంచి జిల్లాలో మందులు, మాత్రల వ్యాపారాన్ని నడిపిస్తోంది. కాసుల కక్కుర్తికి పాల్పడుతోంది. నాణ్యత లేని వాటిని అంటగడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు అతిక్రమిస్తోంది. ప్రధానంగా పసి వైద్యం పెనుగండంగా మారింది. పసి ప్రాణాలను బలి తీసుకుంటోంది. అయినా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో అధికారికంగా 1200 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. అనాధికారికంగా 1000పైగా నడస్తున్నాయి,. ఆర్ఎంపీ క్లీనిక్‌లు 2వేల వరకు ఉంటున్నాయి. ఇటీవల 150 వరకు నకిలీ ఆర్ఎంపీలు పట్టుబడగా..ఇంకా వేల మంది నకిలీ ఆర్ఎంపీల అవతారాన్ని గుట్టు రట్టు చేయాల్సి ఉంది. దీనికి తోడు మెడికల్ షాపులు 1500 వరకు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిబంధనలు అతి క్రమిస్తున్నాయి. ఇష్టానుసారంగా మందులు, మాత్రలు అమ్మేస్తున్నాయి.

అనుమతి లేని ఏజెన్సీలు

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాకు అత్యధికంగా మందులు, మాత్రలు సరఫరా అవుతున్నాయి. నిత్యం రూ. కోటి విలువ చేసే మెడిషన్లు జిల్లాకు దిగుమతి అవున్నాయి. రోజు వారీగా రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వ్యాపారం నడుస్తోంది. ఇదే అదునుగా చేసుకుని మెడికల్ ఏజెన్సీలు పుట్టగొడుగులా పుట్టుకొచ్చాయి. జిల్లాలో 40పైగా ఏజెన్సీలు ఉండగా...అనుమతులు లేని ఏజెన్సీలు పదుల సంఖ్యలో ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగా కొన్ని నాణ్యత లేని మందులు, మాత్రలు మార్కెట్లోకి చేరిపోతున్నాయని అంటున్నారు. కంపెనీలు కొత్తగా తయారు చేసిన మందులు, మాత్రలు డ్రగ్స్ కంట్రోల్ అనుమతులు రాకముందే మార్కెట్‌లోకి వచ్చేస్తున్నాయని వెల్లడిస్తున్నారు. చాలా మంది వైద్యులు కమీషన్లకు కుక్కర్తి పడి... నాణ్యత లేని మందులను రెఫర్ చేస్తున్నారని, ఇది ప్రజానీకానికి ప్రమాదం పొంచి ఉందని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కోల్డ్రిఫ్‌లో ఏముంది..

మధ్యప్రదేశ్‌లో దగ్గు సిరప్ తీసుకున్న పిల్లలు మరణించారు. అక్కడి ప్రభుత్వం చేపట్టిన పరిశీలనలో పలు విషయాలు బయటకొచ్చాయి. తమిళనాడు ప్రభుత్వం సైతం ఆ సిరప్‌పై పరిశీలన చేయగా వాస్తవాలను బయటపెట్టి..ఉత్పత్తిని ఆపేసింది. కోల్డ్రిఫ్ అనే దగ్గు సిరప్‌లో (బ్యాచ్ నంబర్ –ఎస్ఆర్ –13), డై ఇథైలిన్ గ్లెకైల్ (డీఈజీ–48.6శాతం) అనే ప్రమాదకర రసాయనం పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. ఇదంతా పిల్లలను హరించేలా పనిచేస్తాయని వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా ఇదీ కిడ్నీపై ప్రభావితం చేస్తోందని బయటపడింది.

కట్టడి చర్యలు ఏమాత్రం...

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఘటనలు చూసి కూడా జిల్లా అధికారుల్లో కనీస చలనం లేదు. జిల్లాలో అనధికారిక ఆస్పత్రులు కుప్పలు తెప్పలుగా ఉన్న చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. జిల్లాలో పలు ఆర్ఎంపీల వద్ద చికిత్స తీసుకుని పిల్లలు మృతి చెందిన ఘటనలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డ్రగ్స్ నియంత్రణ శాఖ అధికారులకు కనువిప్పు కలిగించడం లేదు. ఇలానే వదిలేస్తే..మరో మధ్యప్రదేశ్ వంటి ఘటనలను జిల్లాలో చూడక తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చిన్న పిల్లల మందులు సైతం...

జిల్లాలో ప్రధానంగా గుండె, బీపీ, షుగర్, క్యాన్సర్, తదితర సమస్యలకు సంబంధించిన మందులు, మాత్రలు మాత్రమే ఎక్కువగా అమ్ముడుబోతున్నాయి. తర్వాత గర్భిణులు, చిన్నపిల్లలకు సంబంధించిన మాత్రలు అధిక మొత్తంలో విక్రయాలు జరుగుతున్నాయి. కానీ పిల్లల విషయంలో చాలా మంది వైద్యులు సరైన నిబంధనలు పాటించడం లేదు. చికిత్స చేయడంతో పాటు జ్వరం, జలుబు వంటి వాటికి కూడా ఇంజెక్షన్లు, సిరప్ ఇచ్చేస్తున్నారనేది ఇప్పుడు ప్రధానమైన వాదనగా నడుస్తోంది. అందులోనూ అధికంగా కమీషన్ ఇచ్చే మందులు, మాత్రలను మాత్రమే రెఫర్ చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో తరహాలో జిల్లాలో కూడా చాలా మంది వైద్యులు చిన్న పిల్లల దగ్గు, జలుబు నివారణకు కోల్డ్రిఫ్‌ను రెఫర్ చేశారని పలువురు అంటున్నారు. ఈ కోల్డ్రిఫ్ తయారీ కంపెనీ తమిళనాడులోని చెన్నైలో ఉండడం గమనార్హం.

పిల్లలకు సొంత వైద్యం వద్దు



దగ్గు రావడానికి పలు రకాల కారణాలు ఉంటాయి. పెద్దలకు మాత్రమే కాదు. పిల్లలకు కూడా పలు సమస్యల తో దగ్గు వస్తుంది. అలా అని వెంటనే మెడికల్ షాపులకు వెళ్లి దగ్గు సిరప్ కొని ఇష్టానుసారంగా ఇచ్చేస్తున్నారు. ఇదీ ప్రమాదకరం. భవిష్యత్తులో పలు అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయి. కచ్చితంగా డాక్టర్ల సలహా మేరకు సిరఫ్‌లు, మాత్రలు వాడాలి.

– అశోక్‌కుమార్, వైద్య నిపుణులు, చిత్తూరు

వైద్యుల సలహాతో సిరప్ ఇవ్వాలి



రెండేళ్ల వరకు పిల్లలకు ఏ డాక్టర్ కూడా సిరఫ్‌లు ఇవ్వరు. సెలనైజెడ్ డ్రాప్స్ ఇస్తారు. చిన్న రెమిడీస్ చెబుతారు. పిల్లలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారన్న సమయంలో మాత్రమే సిరఫ్‌లు ఇస్తారు. ఆ సిరఫ్‌లను కూడా ఇష్టానుసారంగా ఇవ్వకూడదు.

– ఆశిత, చిన్న పిల్లల వైద్య నిపుణులు

చర్యలు తీసుకుంటాం..



ఇది వరకే అనధికారిక ఆస్పత్రుల వివరాలు పూర్తి స్థాయిలో సేకరించాం. జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు కచ్చితంగా తనిఖీలు చేస్తాం. రిజిస్ట్రేషన్ చేసుకోని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం. ఆర్ఎంపీలు చిన్న పిల్లలకు వైద్యం చేస్తున్నారని తెలిస్తే వదిలిపెట్టం.

– సుధారాణి, డీఎంహెచ్ఓ, చిత్తూరు

విశ్వం సైనిక్ నవోదయ
జాతీయస్థాయి నెం.1 కోచింగ్ సెంటర్
Viswam's 35 Years of Excellence
SAINIK 2025 STATE FIRST RANK 66 Total Seats Achieved 967
NAVODAYA 2025 SEATS ACHIEVED 69 Total Seats Achieved 1127
షార్ట్ టర్మ్ బ్యాచ్ 23.10.2025
BUS FACILITY AVAILABLE HOSTEL FACILITY AVAILABLE
Varadaraja Nagar, K.T.Road Viswam Nagar Jeevakona, Tirupati
86888 88802 | 93999 76999

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate
TO-LET
Tolet for Doctors / Clinics 2 BHK-1230 Sq.Feet. Reddy & Reddy Colony, Tirupati. Contact Cell: 98487 51666, 77024 61959.

Wanted
Wanted Spare Parts Incharges, Sales Executives, Service Supervisors, Contact: Sri Durga Motors, Renigunta Road, Tirupati. Cell: 9700663181.

కస్టమర్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ.15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక